
అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 17 నవంబర్ 2022 పేజీలు : 04

# కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం దగ్ధం కేసులో అనుమానాలు ఎన్నో..!

**- వెంటిలేటర్ వద్దే నిప్పు పెట్టారా..? - సిసి కెమెరాలోని దృశ్యాలను దాస్తున్నారా..? - హడావుడిగా విచారణ ఎందుకు పూర్తి చేశారు.. - అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమా..? !**



వెంటిలేటర్ వద్ద దుండగులు వాడిన చైర్లు



కాలిపోయిన వెంటిలేటర్



**అనంతపురం, నవంబర్ 16 ప్రభాతవార్త బ్యూరో**

పిజెఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు అధినేత పెరుమాళ్ల జీవానందరెడ్డి పామిడి మండలం గజరాంపల్లిలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ కేంద్రం ఇటీవల దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు దుశ్చర్యలే కారణమని పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ సంఘటన జరిగిందని ఎంతవరకు కరెక్ట్ అన్నది చర్చనీయాంశంగా మారింది. అధికార వైసీపీ నేతల ఒత్తిళ్ల మేరకే హడావుడిగా విచారణ నిర్వహించి, ఈ సంఘటనలో నిజాలను తొక్కి పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. సిసి కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను పోలీసు అధికారులే దాస్తున్నారా.. అన్న సందేహం వ్యక్తం అవుతోంది. సిసి కెమెరాలోని దృశ్యాలు పూర్తిగా బయటపడితే నిజాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది. గజరాంపల్లి వద్ద ఉన్న కుట్టు మిషన్ కేంద్రంలో 8 సిసి కెమెరాలు ఉన్నాయి. సంఘటన జరగక ముందు రెండు మూడు రోజులు, సంఘటన జరిగిన తర్వాత పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను పరిశీలిస్తే నిజాలు నిగ్గు తేలే అవకాశం ఉందని బాధితులు చెబుతున్నారు. ఈ దుశ్చర్యకు ముందుగా ఎవరైనా రెక్కి నిర్వహించారా.. అన్న కోణంలో సిసి కెమెరాలను పరిశీలిస్తే నిజాలు నిగ్గు తేలే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం దగ్ధమైన సంఘటనలో 36లక్షలు నష్టం వాటిల్లింది. ఆ కేంద్రంలో 70 మిషన్లు ఉంటే 30 మిషన్లు దగ్ధమయ్యాయి. కుట్టు మిషన్ కేంద్రంకు వెంటిలేటర్ ఉంది. వెంటిలేటర్ వద్ద పూర్తి దగ్ధమైంది. వెంటి లేటర్ వద్ద నుంచి నిప్పును కుట్టుమిషన్ కేంద్రంలోకి వేసి ఉంటారని అనుమానం వ్యక్తమవుతోంది. వెంటిలేటర్ వద్ద రెండు చైర్లు కూడా ఉన్నాయి. నిప్పు పెట్టే సమయంలో ఆ చైర్లను దుండగులు వాడి ఉంటారని బాధితుల అనుమానం. వెంటిలేటర్ వద్దే ఒక ఫ్లెక్సీని, వైర్లను లోపలికి దూర్చి నిప్పు పెట్టి ఉంటారని అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ఇది దుశ్చర్యుల పనే అని బలమైన ఆధారాలు ఉన్ననేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపితే బాధ్యులైన వారు ఎవరన్నది తేలే అవకాశం ఉంది. పిజెఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు అధినేత జీవానందరెడ్డి తెలుగు దేశం పార్టీలో ఉన్నారు. ఒకవైపు సేవా కార్యక్రమాలు చేస్తూ మరోవైపు పార్టీ తరుపున వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జీవానందరెడ్డి ఎదుగుదలను ఓర్వలేకే అధికార పార్టీ నేతలు కుట్టుమిషన్ కేంద్రాన్ని దగ్ధం చేసి ఉండవచ్చని బాధితుల ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. ఇప్పటికే దాదాపు 1000 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉంటారు. గార్మెంట్ పరిశ్రమకు పామిడి పెట్టింది పేరు. పామిడిని దక్షిణ ముంబాయి

మిగతా 4లో...

# శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాలి

**-వికేంద్రీకరణ సాధన సమితి జేఏసి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీ నేతలు, మేధావులు

**అనంతపురం టౌన్, నవంబర్ 16 ప్రభాతవార్త**

వెనుకబడిన రాయలసీమకు అన్యాయం జరుగుతుందని దూర ఆలోచనలతో అప్పటి మేధావులన కల్లూరు సుబ్బారావు,పప్పూరు రామాచార్యులు లాంటి మేధావులు రాజకీయ ఉద్దండులు 85 సంవత్సరాల క్రితమే అవిభక్త రాష్ట్రంలో ఉన్న మద్రాస్‌లో శ్రీబాగ్ ఒడంబడిక అనే పెద్ద మనుషుల ఒప్పందం జరిగిందని ఆ ఒప్పందం ప్రకారం రాయలసీమకు అభివృద్ధి విషయంలో ఇంత వరకు ఆ ఒప్పందంలోని అంశాలు ఏవి అమలు జరగక రాయలసీమకు అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మూడు రాజధానుల అంశం రాయలసీమ వెనుకబాటుతనం నదీ జలాల పంపకం పారిశ్రామిక రంగంలో ముఖ్యంగా అనంతపురం జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలు ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వికేంద్రీకరణ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక లలిత కళాపరిషత్ ఆవరణలో సత్యాగ్రహ దీక్ష సభ జరిగింది. తొలుత కల్లూరు సుబ్బారావు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల సమర్పించి సత్యాగ్రహ దీక్ష సభలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రసంగిస్తూ కోస్తా ప్రాంతమైన అమరావతి రాజధాని విషయంలో రాయలసీమ వాసులకు ఎన్నో అనుమానాలు ఉన్నాయని అప్పుడు కర్నూలు, ఇప్పుడు హైదరాబాద్ పోగొట్టుకున్న నేపథ్యంలో అమరావతిలో రాజధాని ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని అయితే రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని సదాశయంతో మూడు ప్రాంతాల్లో మూడు రాజధానులు ఉండాలని తమ ప్రభుత్వం అభిలాషిస్తోందని, ఒకే ప్రాంతంలో అభివృద్ధి కేంద్రీకృతం అయితే మనం ఎలా నష్టపోయాము అనే విషయం తెలిసిందేనని అందుకోసమే తమ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల అంశం పట్ల గట్టిగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. విబేధాలతో రాజకీయపరమైన అంశాలతో ప్రాంతాలు వేరై రాజధానులు మారే ప్రమాదం నుంచి మనం బయటపడాలంటే అభివృద్ధి వికేంద్రీకరణతోనే సాధ్యమని అన్నారు. రాయలసీమ వెనుకబడిన అనంతపురం లాంటి జిల్లాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం జరగకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి విషయంలో సమతౌల్యత సాధించాలని ఇదే తమ ప్రభుత్వ ఆశయమని అన్నారు. ముఖ్యంగా రాజకీయంగా పారిశ్రామికంగా నదీ జలాల పంపకంలో యువత మేధావులు ప్రజా సంఘాలు ప్రతిపక్షాలు రాజకీయాల కతీతంగా ఉద్యమించాలని పునరుద్ఘాటించారు. ఈ సభకు రజక కార్పోరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, సీనియర్ జర్నలిస్టు కెపి.కుమార్, బెస్త కార్పోరేషన్ డైరెక్టర్ కెవి.రమణ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ లాయర్ రామిరెడ్డి, మానవ హక్కుల నేత బాషా తదితరులు పాల్గొన్నారు.

# మూడు రాజధానుల వికేంద్రీకరణతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి: మంత్రి ఉష శ్రీచరణ్

**-పట్టణంలో భారీ ర్యాలీ-టీ సర్కిల్ కూడలిలో మానవహారం**





భారీ ర్యాలీ-మానవహారం నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, ఇన్‌సెట్‌లో మంత్రి మానవహారంలో పాల్గొన్న దృశ్యం

**కళ్యాణదుర్గం, నవంబర్ 16, ప్రభాతవార్త**

మూడు రాజధానుల వికేంద్రీకరణతోనే రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమాంతరంగా, సమగ్రంగా అభివృద్ధి సాధ్యమన్న బృహత్తర అశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నిజాయితీగా సాగిస్తున్న కృషిని ప్రతిపక్షాలు రాజకీయ దురుద్దేశ్యంతో రాజకీయ లబ్ది కోసం అనవసర రాద్ధాంతం చేసి, ప్రజలను మభ్య పెడుతున్నారని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా బుధవారం పట్టణంలో వివిధ కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, పట్టణ ప్రధాన కూడలి టీ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి మూడు రాజధానులకు మద్దతుగా నినాదాలు చేసారు.ఈ సందర్భంగా మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు మూడు రాజధానులకు అనుకూలంగా ఉంటే కేవలం చంద్రబాబునాయుడు ప్రతిపక్షపార్టీలు రాజకీయలబ్ది కోసం వ్యతిరేకిస్తునా న్నరన్నారు. రాష్ట్ర విభజనలో హైద్రాబాదు మహానగరాన్ని పోగొ ట్టుకుని, రాజ ధాని లేని రాష్ట్రంగా అంధ్రప్రదేశ్ అనేక సమస్యలను ఎదుర్కొంటోందని అన్నారు. హైద్రాబాదులాగా ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేసినందునే ఏపిలో అలాంటి నగరం లేకుండా పోయిందని, చేసిన తప్పునే మరలా చంద్రబాబునాయుడు తనేదో గొప్ప అలోచన చేసినట్లు మరలా అమరావతిని మాత్రమే అభివృద్ధి చేయాలని అశించడం తగదన్నారు.అందుకే అ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రా ష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెనుకబడిన ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందాలని అమరావతితో పాటు రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలు కూడా సమాంతరంగా అభివృద్ధి చెందితేనే సమగ్రా భివృద్ధి సాధ్య మని మూడు రాజధానులను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ప్రజలందరు గమనించాలని విజ్ఞప్తి చేసారు.రాష్ట్రంలో ఉనికి కోల్పోసయిన చంద్ర బాబునాయుడు రాజకీయ కుయుక్తులు పన్నుతూ ఒకే రాజధానంటూ అమాయక ప్రజలను మభ్యపెడుతూ రాజకీయంగా లబ్ది కోసం ప్రాకులా డుతు న్నారని దుయ్యబట్టారు. ప్రజలందరూ మూడు రాజధానులను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం నాయకులు మాధవ,మున్సిపల్ వైఎస్ చైర్మన్ జయం ఫణీంద్ర, ఎంపిపి మారుతమ్మ, వైఎస్ ఎంపిపి లక్ష్మికాంతమ్మ, జడ్‌పిటిసి ఓబుళప్ప, సుదీర్, బాబురెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అభివృద్ధికి వికేంద్రీకరణ ఒక్కటే మార్గం



వికేంద్రీకరణ ర్యాలి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**కదిరి, నవంబర్ 16, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే వికేంద్రీకరణ ఒక్కటే ఎకైక మార్గం అని కదిరి ఎమ్మెల్యే డాక్టర పివి సిద్ధారెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన వికేంద్రీకరణకు మద్దతుగా ఎమ్మెల్యే ర్యాలి నిర్వహించి ప్రజలకు కరపత్రాలను అందచేసి ప్రజల మద్దతును కోరారు. అనంతరం ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి, అన్ని ప్రాంతాల ప్రజలకు సమన్యాయం చేయడానికి మూడు రాజధానులు ఏరా ్పటు చేయడానికి చర్యలను ముఖ్యమంత్రి చేపట్టారన్నారు. కేంద్రీకరణ అంశాన్ని పరిశీలించి, పరిగణించి 85 సంవత్సరాల క్రితం నవంబర్ 16వ తేదీ 1937లో శ్రీబాగ్ వడంబడిక జరిగిందన్నారు. అప్పటి ఉమ్మడి రాజధాని మద్రాసు రాష్ట్రంలో కోస్తా, రాయలసీమప్రాంత వాసులకు తమిళ వర్గాల నుంచి వివక్షత ఎదుర్కొం టున్నారన్న ఉద్దేశ్యంతో కోస్తా, రాయలసీమ వాసులు ప్రేత్యక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి తెరలేపారన్నారు. శ్రీబాగ్ ఒప్పందం, ఒడంబడిక మేరకే కాశీనాథుని నాగేశ్వర్‌రావు నివేదికలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక కేంద్రం, రాయలసీమతో పాటు కోస్తాలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న తలంపుతోనే ఈ అంశం తెరపైకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే కృష్ణా, పెన్నా మిగులు జలాలు మిగిలిన ప్రాంతాలకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చారన్నారు. రాష్ట్రానికి కర్నూలు రాజధానిని చేసి తిరిగి హైదరాబాద్‌కు మార్చారన్న సంగతిని అందరూ ఒక్కసారి మననం చేసుకోవాలన్నారు. వికేంద్రీకరణ చట్టాన్ని అనుసరించి అందరూ అన్ని పార్టీల నాయకులు మూడు రాజధానులకు మద్దతు ప్రకటిస్తే ప్రజలకు న్యాయం చేసిన వారం అవుతామని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే జగనన్న అభిమతం

**- ఏపి విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి**



ర్యాలీ చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి



వైఎస్ఆర్ సర్కిల్ వద్ద మానవ హారం చేసిన దృశ్యం

**శింగనమల, నవంబర్ 16 ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్న కట్టుబడి ఉన్నారని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే జగనన్న అభిమతమని ఏపి విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మూడు రాజధానుల కోసం శింగనమల మండల కేంద్రంలో వైసీపీ నాయకులు, కార్య కర్తలతో భారీ ఎత్తున ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపి విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. ఎంత కష్టమైనా ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా తాను అనుకున్నది సాధిస్తానని, ఏపిలో మూడు రాజధానుల నిర్మాణాలు, వికేంద్రీకరణకు మద్దతుగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైకాపా కాంగ్రెస్ పార్టీ సంఘాలు, ఉద్యోగులు, మేధావులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు, ర్యాలీలు, మావన హారం నిర్వహిస్తోందని అన్నారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో సుపరిపాలన అనే శీర్షిక దగ్గర చాలా స్పష్టంగా జగన్న చెప్పారన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేస్తాం.. ప్రతి 2వేల మందికి ఒక సచివాలయం, ప్రతి 50 మందికి ఒక వాలెంటరీను చేస్తామని ప్రజలకు కష్టం తెలియకుండా సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. ఈ మూడున్నర ఏళ్ల కాలంలో సుమారు 15,004 సచివా లయ భవనాలను ఏర్పాటు చేశామని, అన్నట్టుగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలను బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమా చేస్తున్నామన్నారు. ఇవన్ని ప్రజా పరిపాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ఆరోజు మేనిఫెస్టోలో చెప్పడం జరిగిందని, రాజధాని ఫ్రీ జోన్‌గా ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామనిచెప్పారు. అయితే ఈ రోజు దుష్ట చతుష్టయం అంతా కలిసి రాజధాని పనులు ముందుకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్నారు. కానీ మేధావులు, ప్రజలు ఎంతో మంది రాజధాని ఒకే చోట కేంద్రీకృతం కారాదని కోరుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు కార్యాలయం నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి వైఎస్ఆర్ సర్కిల్ వద్ద మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, గ్రామ సర్పంచు నాగమునెమ్మ, వైస్ ఎంపిపి విజయ, ఎంపిటిసి ఉమా, ఆ పార్టీ మండల కన్వీనర్ నగేష్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే రాష్ట్ర అభివృద్ధి

**-వికేంద్రీకరణకు అందరూ మద్దతు ఇవ్వాలి -రౌండ్ టేబుల్ సమావేశంలో ముక్తకంఠంతో పేర్కొన్న ఎమ్మెల్యేలు**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శంకర్‌నారాయణ

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 16, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే రాష్ట్ర అభివృద్ధి కొనసాగుతుందని మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, తిప్పేస్వామిలు పేర్కొన్నారు. బుధవారం సాయి అరామంలో జరిగిన వికేంద్రీకరణ మన మద్దతు అనే అంశంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలతో పాటు పలు సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వికేంద్రీకరణతోనే ప్రాంతాల మధ్య సమతుల్యత ఏర్పడుతుందని, అందరూ వికేంద్రీకకరణకు మద్దతు ఇచ్చి రాష్ట్ర అభివృద్ధికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. శ్రీబాగ్ ఒడంబడిక 85 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అధికార వికేంద్రీకరణకు మద్దతుగా జిల్లా కేంద్రంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ గొప్పలక్ష్యంతో రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అమరావతి ఒక్కటే రాజదానిగా రుద్దడం ద్వారా అధికారం, అభివృద్ధి కేంద్రీకృతం చేస్తూ తమ స్వార్థ ప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీ లాంటి పార్టీల నేతల కుయుక్తులను తిప్పికొట్టాలన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక అమలు అయితే, వెనుకబడినటువంటి రాయలసీమ ఎంతో అబివృద్ధికి నోచుకుంటుందన్నారు. ప్రాంతాల మధ్య విద్వేషాలను రగిల్చే విధంగా కొందరు నేతలు పావులు కదపడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ప్రస్తుతం వికేంద్రీకరణ ద్వారా రాష్ట్ర హై కోర్టు కర్నూలులోను, పరిపాలన విభాగం వైజాగ్‌లోను అసెంబ్లీ కార్యాలయం అమరావతిలో ఉండడం వల్ల అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయన్నారు. మరో సారి రాయలసీమ వాసులు నష్టపోకుండా ఇప్పుడే ముఖ్యమంత్రి ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు కంకణ బద్ధులయ్యారన్నారు. అన్ని ప్రాంతాల వారు, అన్ని వర్గాల ప్రజలు వికేంద్రీకరణకే మద్దతు ఇచ్చి రాష్ట్ర ప్రయోజనాల కోసం అండగా నిలవాలని వారు ఈ సందర్భంగా కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు వికేంద్రీకరణపై తమమతమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నేతలు కేశవరెడ్డి, లోచర్ల విజభాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, ఎంపిపి రమణారెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, లాయర్ బాస్కర్ రెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, కౌన్సిలర్లు సాయిగీత, రమణ, చెరువు భాస్కర్ రెడ్డి, నాయకులు నారాయణ రెడ్డి, సూర్యగౌడ్, ఉపాధ్యాయ సంఘం నేతలు రమణారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, ఎన్‌జివో సంఘం అధ్యక్షులు రామ్మోహనలతో పాటు వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

